క్లుప్తంగా

నేడు బాస్కెట్‌బాల్, వాలీబాల్ ఎంపికలు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు ఎంపికలు జరుగుతున్నట్లు పీయూ పీడీ శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 10 గంటలకు బాస్కెట్ బాల్ ఎంపికలు ఉంటాయని, అలాగే ఈ నెల 7న వాలీబాల్ టీంలను ఎంపిక చేస్తామన్నారు. పీయూ పరిధిలోని కళాశాలల విద్యార్థులు ఎంపికలో పాల్గొనాలని ఆయన సూచించారు.

కార్యవర్గం ఎన్నిక

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఎంఎస్ఎఫ్ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కార్తిక్ మాదిగ పేర్కొన్నారు. అధ్యక్షుడిగా కమలాకర్ మాదిగ, కార్యదర్శిగా దేవరాజ్, ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్, తదితరులను ఎన్నుకున్నట్లు వివరించారు. ఈనెల 11న హైదరాబాద్‌లో జరిగే విశ్వరూప మహాసభ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

రాందాస్‌కు సన్మానం

మహబూబ్‌నగర్ రూరల్: విశ్వజన కళా మండలి (45 సంవత్సరాల) వార్షికోత్సవ వేడుక మంగళవారం హైదరాబాద్‌లో డాక్టర్ మాస్టర్‌జీ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన ఓ పాట పాడి ఎమ్మార్పీఎస్(ఆర్ఆర్) రాష్ట్ర అధ్యక్షుడు రాందాస్‌కు అంకితం ఇచ్చారు. అనంతరం శాలువ, పూలమాలతో సన్మానించారు.

రాహుల్ సభకు తరలిన నాయకులు

నవాబుపేట: జడ్చర్లలో జరిగిన రాహుల్‌గాంధీ సభకు మండలం నుంచి భారీ ఎత్తున జనం, నాయకులు తరలినట్లు కాంగ్రెస్ అధికార ప్రతినిధి దుశ్యంత్‌రెడ్డి తెలిపారు. సభ విజయవంతం కావటంతో అధికారపార్టీకి వణకు మొదలైందని, ఇక మిగిలింది కాంగ్రెస్ గెలుపేనని అన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

హన్వాడ: మండల పరిధిలోని టంకరకి చెందిన బీజేపీ కార్యకర్త శ్రీను ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి బుధవారం గ్రామానికి చేరుకుని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. రూ.20వేలు ఆర్థికసాయం అందించారు. జిల్లా కార్యదర్శి కొండాబుచ్చిరెడ్డి, మండల అధ్యక్షుడు వెంకటయ్య, ప్రధానకార్యదర్శి శ్రీనువాసులు తదితరులు పాల్గొన్నారు.

ఆశీర్వదించి అవకాశం ఇవ్వండి

పాలమూరు: కేంద్రం ఇచ్చిన నిధులతో నిర్మించిన అప్పన్నపల్లి బ్రిడ్జిని స్థానిక నేతలు తాము చేశామని చెప్పుకోవడం హాస్యాస్పదమని, బీజేపీని గెలిపిస్తే పాలమూరులో ఎమ్మెల్యే ట్యాక్స్, కమిషన్లు ఉండవని అభ్యర్థి మిథున్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని అప్పన్నపల్లి ఆంజనేయ స్వామి ఆలయంలో బుధవారం ఉదయం పూజలు చేసి ఆ తర్వాత ప్రచారం ప్రారంభం చేశారు. హౌజింగ్ బోర్డు, శ్రీరామా కాలనీ, శ్రీరాంనగర్ కాలనీ, బీసీ కాలనీ, ఏనుగొండ, ఎస్సీ కాలనీ, గోల్డెన్‌పార్క్ కాలనీ, వివేకానంద నగర్ కాలనీలో ప్రచారం నిర్వహించారు. తనను ఆశీర్వదించి గెలిపిస్తే పాలమూరును అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. ఏపీ జితేందర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు వీర బ్రహ్మాచారి తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌డీ పట్టా

జడ్చర్ల టౌన్: మండలంలోని చిట్టిబోయిన్‌పల్లితండా వాసి వాల్యానాయక్ ఉస్మానియా యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ సాధించాడు. మారుమూల అడవి, కొండ ప్రాంతాల్లో నివసించే గిరిజనులకు కేంద్ర ప్రభుత్వ పతకాలు అందటం, ఉప ప్రణాళిక్పై ఐదేళ్లుగా పరిశోధన ఆయన కొనసాగించాడు. పట్టాను ప్రదానంపై వాల్యానాయక్ బుధవారం విలేకరులకు వివరించారు. తండావాసులు ఈ సందర్భంగా వాల్యానాయక్‌ను అభినందించారు.

బీచ్ హ్యాండ్‌బాల్ పోటీలకు జిల్లా వాసి



మహబూబ్‌నగర్ క్రీడలు: గోవాలో ఈనెల 5 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించే 37వ నేషనల్ గేమ్స్ బీచ్ హ్యాండ్‌బాల్ పోటీలకు జిల్లా కేంద్రానికి చెందిన చంద్రకాంత్ ఎంపికయ్యారు. ఇతను గతంలో సీనియర్ నేషనల్, ఇంటర్ జోనల్ హ్యాండ్‌బాల్ పోటీల్లో రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించాడు. చంద్రకాంత్ ఎంపికపై జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జియావుద్దీన్, ఉపాధ్యక్షుడు అనిల్ కుమార్, కోశాధికారి ముహిబుర్ రెహమాన్, సంయుక్త కార్యదర్శి ఒబేదుర్ రెహమాన్, కార్యనిర్వాహక కార్యదర్శి అహ్మద్ హుస్సేన్, కోచ్ ప్రదీప్‌కుమార్ హర్షం వ్యక్తం చేశారు. జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ చాటాలని ఆకాంక్షించారు.

‘అద్దె’లతో అదనపు భారం

- నర్సరీల నిర్వహణకు స్థలాల కొరత
- ప్రైవేటు స్థలాలలే దిక్కు
- భారాన్ని మోయలేమంటున్న సర్పంచులు
- తంటాలు పడుతున్న అధికారులు



వెన్నాచేడ్‌లో ప్రైవేటు స్థలంలో నిర్వహిస్తున్న నర్సరీ

గండేడ్: ఓవైపు చేసిన పనులకు బిల్లులు రాక మరోవైపు పారిశుద్ధ్యపు కార్మికులకు జీతాలు చెల్లించలేక , ట్రాక్టర్లకు డీజిల్ పోయించలేక అవస్థలు పడుతున్న సర్పంచులకు నర్సరీల నిర్వహణకు అద్దెలు చెల్లించడం తలకు మించిన భారంగా మారింది. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారం కార్యక్రమం ఏటా కొనసాగిస్తున్నారు. లక్ష్యం మేరకు మొక్కలు నాటడానికి ఒక్కో గ్రామంలో రూ. లక్షలు వ్యయం చేస్తున్నారు. ఈ క్రమంలోనే నర్సరీలు ప్రారంభం అయినప్పటి నుంచి ప్రైవేటు స్థలాల్లో నిర్వహిస్తూ వచ్చారు. వీటికి నెల నెల రూ. వేలల్లో అద్దెలు చెల్లించారు. రాను రాను ఇది గ్రామ పంచాయతీలకు తలకు మించిన భారంగా మారుతోంది. దీన్ని అధిగమించడానికి ప్రభుత్వ స్థలాలకోసం అధికారులు అన్వేషిస్తున్నా కొన్ని చోట్ల దొరకడం లేదు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేటు స్థలాలపైనే ఆధారపడాల్సి వస్తోంది. గండేడ్, మహమ్మదాబాద్ మండలాల్లో 49 నర్సరీలు ఉన్నాయి. అద్దెల భారం తగ్గించాలని నర్సరీలను ప్రభుత్వ స్థలాల్లోకి తరలిస్తున్నారు. నీటి వసతి లేకపోవడం , ప్రభుత్వ భూమి లేకపోవడం వంటి కారణాలతో ఇంకా చాలాచోట్ల ప్రైవేటు స్థలాల్లోనే కొనసాగుతున్నాయి. ఉమ్మడి మండలంలో 26 గ్రామాల్లో ప్రైవేటు స్థలాల్లో కొనసాగిస్తున్నారు.

అద్దెలతో అదనపు భారం

ఆయా గ్రామాల్లో ప్రైవేటు స్థలాల్లో కొనసాగుతున్న నర్సరీలకు నెలకు రెండు నుంచి నాలుగు వేలు చెల్లిస్తున్నారు. ఈ చెల్లింపులు ఉపాధి హామీ నుంచి జరగడం లేదు. గతంలో ఒక్కో నర్సరీకి ల్యాండ్ రెంట్ పేరిట రూ. 4వేలు ఉపాధిహామీ నుంచి ఇచ్చేవారు. 2021లో రాగాస్‌కు బదులు ఎన్ఐసీ సాఫ్ట్‌వేర్ అములులోకి వచ్చింది. అప్పటి నుంచి ల్యాండ్ రెంట్ చెల్లింపులు నిలిపివేశారు. నాటి నుంచి గ్రామపంచాయతీల నిధుల నుంచి చెల్లిస్తున్నారు. దీంతో నిర్వహణ భారంగా మారింది.

వృథా వ్యయం

ప్రైవేటు స్థలాల్లో ఏర్పాటు చేసిన నర్సరీలకు ఇటీవల గేటు, ఫెన్సింగ్, క్యాటిల్ ట్రఫ్(పశువులు దాటకుండ గేటు వద్ద కింద వేసే పైపులు), నేమ్ ప్లేట్ వంటివి ఏర్పాటు చేశారు. వీటికి గానూ ఒక్కోదానికి రూ. లక్షన్నర వరకు ఖర్చు చేశారు. మొక్కల పెంపకం ఇతరత్రా వాటికి మరో రూ. రెండు లక్షల వరకు ఖర్చవుతుంది. అయితే ఇప్పుడు వీటిని ప్రభుత్వ స్థలాల్లోకి మారుస్తుండడంతో ఖర్చు చేసిన డబ్బులు వృథా అయ్యాయని, ముందుగానే ఈ నిర్ణయం తీసుకుని ఉంటే ఇలాంటి పరిస్థితి ఉండేది కాదని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

అద్దె చెల్లింపు మావల్ల కావడం లేదు

అంతర్‌గంగ సమీపంలో దాదాపు రూ. 2.50 లక్షలు ఖర్చుపెట్టి దిమ్మె ఫెన్సింగ్‌లతో నర్సరీ ఏర్పాటు చేసి మొక్కలు పెంచుతున్నాం. పంచాయతీ నిధుల నుంచి అద్దె చెల్లించాలంటే భారంగా మారుతోంది. ఇప్పటికే అనేక సమస్యలు ఉన్నాయి. ఇంకా అద్దెలు ఎలా చెల్లించాలి. ప్రస్తుతం ప్రభుత్వ స్థలంలో నిర్వహించాలంటున్నారు. మా దగ్గర స్థలం కూడా లేదు.

– జితేందర్‌రెడ్డి, సర్పంచ్, సల్కర్‌పేట్

ప్రభుత్వ స్థలాలకు మార్చాల్సిందే

అన్ని గ్రామాల్లోని నర్సరీలను ఇక నుంచి ప్రభుత్వ స్థలాల్లోనే నిర్వహించాలి. అవి లేనిచోట గ్రామపంచాయతీలకు తీర్మానం చేసి ఇస్తాం వారే నిర్వహించుకోవచ్చు. అలా కాని పక్షంలో రైతులు ముందుకు వస్తే వారికి 100 రోజులు పని కల్పించేలా చూస్తాం. కుటుంబంలో ఇద్దరు ఉంటే చేరో 100 రోజులు పని కల్పిస్తాం. ఇప్పటికి 23 గ్రామాల్లో ప్రభుత్వ స్థలాల్లోకి నర్సరీలను మార్చాం. మిగతా గ్రామాల్లోనూ పంచాయతీలపై భారం పడకుండా స్థలాల కోసం పరిశీలిస్తున్నాం.

– రూపేందర్‌రెడ్డి, ఎంపీడీఓ, ఉమ్మడి గండేడ్ మండలం

ఆ ఇద్దరూ బీజేపీ వారే: మంత్రి



ప్రచారం చేస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ : బీజేపీ నుంచి రాత్రికి రాత్రి పార్టీ మారిన వ్యక్తి కాంగ్రెస్ అభ్యర్థిగా ఉన్నాడని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ విమర్శించారు. బుధవారం స్థానిక 35, 36, 48వ వార్డుల పరిధిలో ప్రచారం నిర్వహించారు. యెన్నం, మిథున్‌రెడ్డిలిద్దరూ బీజేపీకి చెందిన వారేనన్నారు. మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, కౌన్సిలర్ నర్సింహులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): బీఆర్ఎస్ పార్టీలో చేరికల పర్వం కొనసాగుతోంది. బుధవారం స్థానిక కార్యాలయంలో బీజేపీ, కాంగ్రెస్‌లకు చెందిన పలువురు మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సమక్షంలో పార్టీలో చేరారు. నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలోని పలు వార్డులో శ్రీనివాస్‌గౌడ్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అంతకుముందు ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కోర్‌కమిటీ సభ్యుడు, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బాబుల్‌రెడ్డి, జిల్లా ప్రచార కార్యదర్శి వెంకటేష్, జిలా కార్యదర్శి శ్రీనివాస్‌లు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు.

దాడిచేయించిన వారిపై చర్యలు తీసుకోవాలి



కోయిల్‌కొండ: ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిపై కత్తితో దాడిచేయించిన వారిపై చర్యలు తీసుకోవాలని బుధవారం మండల బీఆర్ఎస్ నాయకులు రెవెన్యూ కార్యాలయంలో వినతి సమర్పించారు. ఓర్వలేక హింసా రాజకీయాలకు తెరతీశారని అన్నారు. అధ్యక్షుడు కృష్ణయ్య, నాయకులు రాజవర్ధన్‌రెడ్డి, భీంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బచ్చిరెడ్డి, శమీం తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ ఫలాలు అందించాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

భూత్పూర్: రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందించిన ఘనత సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీకే దక్కుతుందని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని తాటిపర్తి, కొత్తూర్ , పెద్దతండా, కర్వెన గ్రామాలల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టణంలోని రామలింగేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం గ్రామాలల్లో పర్యటించారు. ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి, మత్స్య సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం. సత్యనారాయణ, మున్సిపల్ చైర్మన్ కదిరె శేఖర్‌రెడ్డి, విండో చైర్మన్ అశోక్‌రెడ్డి, ముడా డైరెక్టర్ చంద్రశేఖర్ గౌడ్, రైతుబంధు అధ్యక్షుడు నర్సింహులు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అడ్డాకుల: ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి మూసాపేట మండలం స్ఫూర్తితండా, చక్రాపూర్, తుంకినీపూర్, అచ్చాయపల్లి, జానంపేట గ్రామాల్లో బుధవారం సాయంత్రం ఇంటింటి ప్రచారం చేశారు. జెడ్పీటీసీ ఇంద్రయ్యసాగర్, పార్టీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందన



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మహిళ డిగ్రీ కళాశాల విద్యార్థిని ముస్కాన్ బేగం గోవాలో జరిగిన నెట్ బాల్ పోటీలలో బ్రాంజ్ మెడల్ సాధించింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, అధ్యాపకులు విద్యార్థినిని బుధవారం అభినందించారు.

స్వర్ణకారుల సంక్షేమానికి కృషి



మాట్లాడుతున్న లక్ష్మారెడ్డి

జడ్చర్ల టౌన్: స్వర్ణకారుల సంక్షేమానికి కృషిచేస్తానని స్థానిక ఎమ్మెల్యే డా. లక్ష్మారెడ్డి హామీ ఇచ్చారు. బుధవారం స్వర్ణకారసంఘం, బులియన్ మార్కెట్‌ల సంయుక్త ఆధ్వర్యంలో పట్టణంలోని స్టేషన్‌రోడ్డులో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను వివరించారు. మేనిఫెస్టోను తెలియజేయటంతో పాటు పట్టణంలో జరిగిన అభివృద్ధి గురించి గూర్చి అవగాహన కల్పించారు. అర్హులైన స్వర్ణకారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ దోరేపల్లి లక్ష్మి, మార్కెట్ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, రాష్ట్ర సంగీత నాటక అకాడమీ మాజీ చైర్మన్ బి.శివకుమార్, స్వర్ణకార సంఘం సభ్యులు రాజేష్, జగదీశ్వరాచారి, సురేష్, సత్యనారాయణ పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్స్‌తో ఆత్మవిశ్వాసం పెంపు



మహబూబ్‌నగర్ క్రీడలు: కరాటే మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవడం వల్ల ఆత్మవిశ్వాసం పెరగడంతో పాటు మానసికంగా ఎదగవచ్చని తెలంగాణ స్టేట్ స్కూల్ స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ అధ్యక్షుడు, సీనియర్ మాస్టర్ ఎతిరె చెన్నయ్య అన్నారు. స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో బాలికలకు మాస్టర్ సుష్మిత ప్రత్యేక కరాటే శిక్షణ అందజేస్తున్నారు. ఈ సందర్భంగా బుధవారం శిక్షణ కార్యక్రమంలో చెన్నయ్య కరాటే మెళకువుల గురించి వివరించారు. శిక్షణను బాలికలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం జాహెదాబేగం, కరాటే మాస్టర్లు రవి, సుష్మిత తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఇంటింటి ప్రచారం



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ : జిల్లాకేంద్రంలోని 16వ వార్డు పరిధిలోని బోయపల్లిలో కౌన్సిలర్ మోతిలాల్, మాజీ కౌన్సిలర్ శరత్‌చంద్ర, విక్టరీ యాదయ్య, నాయకులు ప్రచారం నిర్వహించారు.

అడ్డాకుల: శాఖాపూర్‌లో బీఆర్ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఎంపీపీ నాగార్జున్‌రెడ్డి, జెడ్పీటీసీ రాజశేఖర్‌రెడ్డి, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు జయన్నగౌడ్, విండో అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

గండేడ్: కాంగ్రెస్‌వి బోగస్ హామీలని ఎంపీపీ మాధవి, జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెంట్యానాయక్ పేర్కొన్నారు. బుధవారం పగిడ్యాల్‌లో ఇంటింటి ప్రచారం ప్రారంభించారు. పీఏసీఎస్ వైస్ చైర్మన్ లక్ష్మీనారాయణ, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

నిజమే.. ఇవి బొమ్మ ఏనుగులే!

భారీకాయంతో ఉండే గజరాజును ఒక వాహనంలో తరలించడమే గగనం అనుకుంటే.. ఈ డీసీఎంలో రెండు ఏనుగులు ఎలా తరలిస్తున్నారా అని ఆశ్చర్యపోతున్నారా.. అయితే, మీరు బుర్రకు పదును పెట్టకుండా.. కళ్లకు పని చెప్పండి.. అవును, నిజమే.. ఇవి బొమ్మ ఏనుగులే.. బుధవారం హైదరాబాద్ నుంచి కర్నూలు వైపు డీసీఎంలో రెండు ఏనుగు బొమ్మలను తరలిస్తుండగా వాహనదారులు ఆసక్తిగా గమనించారు. అచ్చం నిజమైన ఏనుగుల్లా ఉన్న బొమ్మ గజరాజులను 'సాక్షి' కెమెరా అడ్డాకుల సమీపంలో క్లిక్‌మనిపించింది.

– అడ్డాకుల



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు వ్యతిరేకం



జెండా ఎగరవేస్తున్న నాయకులు

భూత్పూర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని ఏఐటీయూసీ జిల్లా జనరల్ సెక్రటరీ ఎం.రామ్మోహన్ ఆరోపించారు. బుధవారం భూత్పూర్‌లో ఏఐటీయూసీ 104వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండాను ఎగరవేశారు. ప్రభుత్వాలపై పోరాటాలకు కార్మికులు సిద్ధం కావాలని అన్నారు. జిల్లా కార్యదర్శి ఎర్ర నర్సింహులు, మండల అధ్యక్షుడు లక్ష్మణ్ నాయక్, ఉపాధ్యక్షులు సోమ్లానాయక్, చిన్న నర్సింహులు తదితరులు ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణ కోసం అంతిమ పోరాటం



కరపత్రాలతో నాయకులు

మహబూబ్‌నగర్ రూరల్: ఎస్సీ వర్గీకరణ సాధనే లక్ష్యంగా తమ పోరాటం ఉండబోతుందని ఎమ్మార్పీఎస్ (టీఎస్) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లెపోగు శ్రీనివాస్ అన్నారు. ఈనెల 5న హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద జరిగే మాదిగల యుద్ధభేరి సభ కరపత్రాలను మంగళవారం స్థానిక టీఎన్జీఓ భవనంలో విడుదల చేశారు. అభివృద్ధి, సంక్షేమంతో పాటు ఎస్సీ వర్గీకరణకు పాటుపడే పార్టీలకే ఎన్నికల్లో తమ మద్దతు ఉంటుందని అన్నారు. నాయకులు నరేష్, రావుల కృష్ణ, తిరుపతి, రమేష్, జయన్న, ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం



మాట్లాడుతున్న వినోద్‌కుమార్

స్టేషన్ మహబూబ్‌నగర్: అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని కౌన్సిలర్ ఆనంద్‌కుమార్‌గౌడ్ అన్నారు. కాంగ్రెస్‌లో చేరిన ఆయన బుధవారం జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గంలో స్వతంత్రం, స్వేచ్ఛ లేదని, మంత్రి అరాచకం తట్టుకోలేక కాంగ్రెస్‌లో చేరినట్లు వివరించారు. చాలామంది సీనియర్లు కూడా త్వరలో పార్టీ మారే అవకాశం ఉందన్నారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్ అప్రజాస్వామిక పాలనకు విసిగి బీఆర్ఎస్ కౌన్సిలర్లు, నాయకులు కాంగ్రెస్‌లోకి వస్తున్నారని అన్నారు. టీపీసీసీ అధికార ప్రతినిధి జహీర్ అఖ్తర్, కౌన్సిలర్ లతాశ్రీ, నాయకులు అమరేందర్‌రాజు, అనిత, లక్ష్మణ్‌యాదవ్, చంద్రశేఖర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులను మోసం చేశారు



కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకులు

మహమ్మదాబాద్: పేదప్రజలకు న్యాయం చేసింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని అలాంటి పార్టీని మళ్లీ అధికారంలోకి తీసుకురావాలని పరిగి మాజీ ఎమ్మెల్యే టీ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. బుధవారం మహమ్మదాబాద్, చిన్నాయపల్లి, బండమీదిపల్లి, మతంలపల్లి గ్రామాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. మాజీ రెవెన్యూ మంత్రి జయంతి వేడుకల్లో పాల్గొని నివాళులు అర్పించారు. అనంతరం కార్యకర్తల సమావేశంలో నిరుద్యోగులను మోసం చేసిన ప్రభుత్వం బీఆర్ఎస్ అని దుయ్యబట్టారు. ఈ సందర్భంగా పలువురు పార్టీలో చేరారు. అధ్యక్షుడు కేఎం నారాయణ, పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, టీపీసీసీ ఆర్గనైజింగ్ కార్యదర్శి రాములు, మాజీ ఎంపీపీ శాంతీబాయి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి మల్లేపల్లి సర్పంచ్



అనిరుధ్‌రెడ్డితో పార్టీలో చేరిన నాయకులు

రాజాపూర్: మండల పరిధిలోని మల్లేపల్లి సర్పంచ్ శ్యాంబాయితో పాటు వందమంది బీఆర్ఎస్ నాయకులు బుధవారం కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి జనంపల్లి అనిరుధ్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. ఈసందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని పార్టీలో చేరానని పేర్కొన్నారు. అనిరుధ్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీపై ప్రజలు విసుగు చెంది వలసలుగా కాంగ్రెస్‌కి వస్తున్నారని వివరించారు. తనకు అవకాశమివ్వాలని మల్లేపల్లి గ్రామస్తులను కోరారు. మండల అధ్యక్షుడు కృష్ణయ్య, అశోక్, నరహరి, గోవర్ధన్‌రెడ్డి, లింగం, రాములు తఖీబాబా తదితరులు పాల్గొన్నారు.

కోయిల్‌కొండ: నిరంకుశ ప్రభుత్వాన్ని సాగనంపే సమయం ఆసన్నమైందని నారాయణపేట జిల్లా కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు కుంభం శివకుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం మణికొండలో పలువురు ఇతర పార్టీల నాయకులు కాంగ్రెస్‌లో చేరిన సందర్భంగా మాట్లాడారు. ఎంపీటీసీ సతీష్, ఉపసర్పంచ్ చంద్రశేఖర్, వార్డుసభ్యులు తదితరులు ఉన్నారు.

ప్రజల్లో మంచి ఆదరణ లభిస్తోంది



కాంగ్రెస్‌లో చేరిన వారితో యెన్నం తదితరులు

స్టేషన్ మహబూబ్‌నగర్: కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో పూర్తి విశ్వాసం ఉందని, అందుకే రోజు రోజుకు మంచి ఆదరణ లభిస్తోందని ఎమ్మెల్యే అభ్యర్థి యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని 1, 27, 37, 43 వార్డులకు చెందిన ఇతర పార్టీల కార్యకర్తలు బుధవారం యెన్నం శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా యెన్నం మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన పథకాలు, విధానాలు నచ్చి ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు తెలిపారు. అధికారంలోకి వచ్చిన వెంటనే గ్యారంటీ పథకాలను అమలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్, నాయకులు అమరేందర్‌రాజు, లక్ష్మణ్ యాదవ్, ఆనంద్‌కుమార్‌గౌడ్, అజ్మత్‌అలీ, లక్ష్మణ్‌నాయక్, రాములుయాదవ్, సాయిబాబా, హక్ పాల్గొన్నారు.

హన్వాడ: మాజీ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి బుధవారం ఏనెమీదితాండ, మునిమోక్షం, కిష్టంపల్లి గ్రామాల్లో పర్యటించారు. యెన్నం సమక్షంలో అధికార పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. టీపీసీసీ ప్రధానకార్యదర్శి వినోద్‌కుమార్, డీసీసీ జనరల్ సెక్రటరీ సిరాజ్‌ఖాద్రి తదితరులు పాల్గొన్నారు.

గ్యారెంటీ పథకాలపై ప్రచారం



గండేడ్: తెలంగాణను అప్పుల రాష్ట్రంగా మార్చారని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జితేందర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం జక్లపల్లిలో గ్యారెంటీ పథకాలపై ప్రచారం నిర్వహించారు. ఎంపీటీసీ వెంకట్‌రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు ఎప్పుడు!



జానంపేట వద్ద సర్వీస్ రోడ్డుపై ధాన్యం

అడ్డాకుల: మూసాపేట, అడ్డాకుల మండలాల్లో వర్షాకాలంలో వరిసాగు చేసిన రైతులు పంట నూర్పిళ్లు చేస్తున్నారు. వారం రోజులుగా పంటలను కోసి ధాన్యాన్ని సర్వీస్ రోడ్లు, పొలాల్లో నిల్వ చేస్తున్నారు. రాత్రిళ్లు వాటి వద్ద కాపలా ఉంటున్నారు. ఇప్పటి వరకు ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లు మొదలు పెట్టలేదు. కొనుగోలు కేంద్రాలు మొదలు కావడానికి ఇంకా వారం, పది రోజులు పట్టే అవకాశం ఉంది. ఈనేపథ్యంలో అప్పటి వరకు ధాన్యం వద్ద కాపలా ఉండటం రైతులకు తలనొప్పిగా మారింది. మరో వైపు ధాన్యం కొనుగోలు చేసే వ్యాపారులు రైతులను ఆశ్రయించి ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. ధర తగ్గించడంతో పాటు తూకంలోనూ అవకతవకలకు పాల్పడుతుండటంతో ధాన్యం అమ్మాలా.. నిల్వ చేయాలా అన్న డైలమాలో ఉన్నారు.